
# నేరం చేసినవాడు

(ది గిల్టీ పార్టీ)

ఆంగ్లమూలం:
ఓ. హెన్రీ




అతనిది ఎర్రని జుట్టు. పెరిగివున్న గడ్డం. గిజాటుగా వుండే మనిషి. కిటికీ వక్కన రాకింగ్ ఛెయిర్‌లో కూర్చున్నాడతను. పైపు ముట్టించాడు; తృప్తిగా నీలిమేఘాలను వదులుతూ కూర్చున్నాడు. కాళ్ల మూజ్ విప్పేశాడు. రంగు వెలిసిపోయిన నీలం స్లిప్పర్లు వేసుకున్నాడు. న్యూస్ పేపర్ చేత్తో పట్టుకుంటే ప్రపంచం మరిచిపోతాడతను. మహాఆత్రుతగా పెద్ద అక్షరాల్లో వున్న శీర్షికలను మింగేస్తూ, చిన్న అక్షరాలతో వున్న వార్తను వెంటాడుతూ, ఈవినింగ్ పేపర్ మహాదుష్టంగా మడిచేసి, పేపరు చదవసాగాడు.

వక్క గదిలో ఓ స్త్రీ రాత్రికి వంట చేస్తోంది. ఉడుకుతున్న పంది మాంసం, మరుగుతున్న కాఫీ నుంచి ఘాటు వాసనలు వస్తున్నాయి.

బయట తూర్పువైపు వీధుల్లో రద్దీగా వుండే వీధి అది. పొద్దువాలగానే అక్కడ సైతాను తన రిక్రూటింగ్ ఆఫీసు తెరుస్తాడు. ఎంతోమంది పిల్లలు ఆ వీధిలో ఆడుతుంటారు, పరుగెత్తుతుంటారు, డాన్స్ చేస్తూవుంటారు. కొంతమంది చింకిపాతలు ధరించివుంటారు; కొంతమంది తెల్లటి పూవు లాంటి బట్టలు ధరించివుంటారు; కొంతమంది మహాదుష్టంగా, అవిశ్రాంతంగా, డేగల్లాగా దృష్టిసారిస్తూ వుంటారు. కొన్ని ముఖాలు మృదుత్వం మెరుస్తూ వుంటాయి, ముడుచుకుపోతూవుంటాయి; కొంతమంది మొరటుగా అరుస్తూ బూతుకూతలు కూస్తూవుంటారు; మొదటిసారి అవి విన్నవాళ్లు భయంతో వెనక్కి తగ్గిపోయినా, పరిచయం పెరగటంతో తామూ అలాంటి కూతలను కూయటానికి అలవాటు పడిపోతారు-ఇలా సైతాను నివాసంలో పిల్లలు నవ్వుతూ, తుళ్లుతూ ఆడుకుంటూవుంటారు. ఆ ఆటస్థలం పైన ఆకాశంలో ఎప్పుడూ ఓ పెద్ద పక్షి చక్కర్లు కొడుతూవుంటుంది. విదూషకులు దాన్ని సారసపక్షి అంటూ వుంటారు. కానీ, ఆ క్రిస్టీ వీధిజనం వాళ్ల కంటే గొప్ప పక్షిశాస్త్రజ్ఞులు. వాళ్లు దాన్ని రాబందు అని పిలిచేవాళ్లు.

కిటికీ దగ్గర విశ్రాంతిగా కూర్చుని, పేపరు చదువుతున్న మనిషి దగ్గరికి ఆ పన్నెండేళ్ల పిల్ల వచ్చి అంది: "నీకు బడలికగా లేకపోతే చదరంగం ఆడదామా, నాన్నా?"

మూజ్ విప్పేసి, కిటికీ వక్కన కూర్చుని పేపరు చదువుకుతున్న ఎర్రజుట్టు, పెరిగిన గడ్డంతో గిజాటుగా వుండే మనిషి కనుబొమలు ముడిపడ్డాయి. "చదరంగమా? నీ ముఖం! పగలంతా ఒళ్లు హూనమయ్యేట్టు పని చేసి వచ్చిన మనిషికి రవ్వంత విశ్రాంతి అవసరమని తెలీదూ? వెళ్లు, వెళ్లి వీధిలో పిల్లలతో ఆడుకో, పో!"

వంటి చేస్తున్న స్త్రీ గుమ్మం దగ్గరి కొచ్చింది. "ఇదుగో, జాన్! మనమ్మాయి లిజ్జీ ఆ వీధి పిల్లలతో ఆడుకోటం నాకిష్టం లేదు. చెడు సావాసాలూ, బూతుమాటలూ తప్ప అక్కడ మరేం లేవు. పొద్దుటి నుంచీ అది ఇంట్లోనే వుంది. కాస్తంత సేపు దాంతో ఆడితే దానికీ కాలక్షేపం అవుతుంది, ఉల్లాసంగా వుంటుంది" అందామె.

"దానికంత ఉల్లాసం కావాలంటే బయటికెళ్లి ఆ పిల్లలతో ఆడుకోమను. ఇక నన్ను విసిగించక!" అన్నాడు ఎర్రజుట్టు, పెరిగిన గడ్డంతో గిజాటుగా వున్న ఆ మనిషి.

000

"పందెం కట్టండి. నేను ఓడిపోతే యాభై డాలర్లిస్తాను. మీరోడితే పాతికివ్వండి. నేనే గెలుస్తాను. అన్నీని డాన్సుకు తీసుకెళ్లేది ఖాయం!" అన్నాడు కిడ్ ములాలీ.

తన్ను సవాలు చేసినందుకు కిడ్ నల్లటి కళ్లు నిప్పులు కురిపిస్తున్నాయి. అతను జేబులో నుంచి ఐదు పది నోట్లు తీసి బల్ల మీద పెట్టాడు. ఉన్న నలుగురు యువకుల్లో ముగ్గురు పందానికి సిద్ధమయారు. వాళ్లూ మెల్లగా తమ జేబుల్లో నుంచి తమ పందెం డబ్బు తీసి బల్ల మీద పెట్టారు. పందెం డబ్బుకు జమ కట్టుకునే బార్ టెండర్ (బార్ సర్వర్) ఆ డబ్బు తీసుకున్నాడు, ఓ కవరులో పెట్టాడు., అంగుళం పొడుగున్న పెన్సిలు ముక్కతో పందాన్నీ, ఇచ్చిన డబ్బునూ, పేర్లనూ నమోదు చేసి, కాష్ రిజిస్టర్‌లో పడేశాడు కవరును.

"అబ్బో! నువ్వెందుకు కష్టపడాల్సింది చాలా వుంది" అన్నారు పందెం కాసిన యువకుల్లో ఒక యువకుడు, సంతోషంగా.

"అది నాకు సంబంధించింది. నీ కనవసరం!" అన్నాడు కిడ్ (కుర్రాడు) కటువుగా. "మైక్, అందరి గ్లాసులూ నింపు!'"

ఆ రౌండయాక బర్క్, కిడ్‌ను సెలూన్ కార్నర్‌లో వున్న బూట్లు పాలిష్ చేసే స్టాండు దగ్గరికి తీసుకువెళ్లాడు. అతను కిడ్ మీద పడి బతుకుతూవుంటాడు. కిడ్‌కు అతను స్నేహితుడూ, నెచ్చెలీ, గురువూ, మహామంత్రీ కూడా. ఆ బూట్ పాలిష్ స్టాండు దగ్గరే 'కుర్రకారు జులాయి క్లబ్బు'కు సంబంధించిన ముఖ్యవ్యవహారాలన్నీ సెటిలవుతూవుంటాయి. క్లబ్ ప్రెసిడెంట్, సెక్రెటరీల బూట్లకు ఆ రోజు ఐదోసారి టోనీ పాలిష్ చేస్తూవుంటే, బర్క్ ప్రభువుకు విదురనీతిని బోధించాడు.

"ఆ పిల్లతో ఎలాంటి సంబంధమూ పెట్టుకోకు, కిడ్. దాన్నొదిలేయ్!" సలహా ఇచ్చాడు బర్క్. "లేకపోతే చిక్కుల్లో పడిపోతావు. అసలు నీ గర్ల్ ఫ్రెండ్‌ను వదిలేయాల్సిన అవసరమేముందిరా? లిజ్ లాంటి పిల్ల మరొకత్తె నీకు దొరకదు. వందమంది ఆన్నీలైనా ఆమెకు సరిపోలరు."

"నేనేం ఆన్నీ ప్రేమలో పడపోయాననుకోక!" అన్నాడు కిడ్, సిగరెట్ బూడిద తన బూటు మీద పడితే, దాన్ని టోనీ భుజానికి రాసి బూటుకు పాలిష్ పెట్టుకుంటూ. "కానీ, లిజ్జీకి పాఠం నేర్పాలి. నేను తన సొంతం అనుకుంటూందామె. నేను మరింకో అమ్మాయితో మాట్లాడనని ఆమె గొప్పలు చెప్పుకుంటోంది. ఓ పద్ధతిలో-లిజ్ బానేవుంటుంది. ఈ మధ్యన విపరీతంగా తాగుతోంది. కట్టుబాటున్న స్త్రీ మాట్లాడకూడని భాష మాట్లాడుతోంది."

"ఆమెతో నీ పెళ్లి నిశ్చయమైంది కదూ?" అడిగాడు బర్క్.

"అవును. బహుశా వచ్చే ఏడు మా పెళ్లవుతుంది."

"ఆమెకు అంతకుముందు తాగటం అలవాటు లేదు. నువ్వే మొదట ఆమె చేత బీరు గ్లాసు పట్టిస్తుంటే నేను చూశాను. అది రెండేళ్ల క్రితం. అప్పుడామె తల మీద హాట్ కూడా పెట్టుకోకుండా రాత్రి భోజనమయ్యాక నిన్ను కలవటానికి వీధి మూలకు వచ్చేది. అప్పుడామె చాలా ఒద్దికగా వుండే మనిషి. సిగ్గుపడకుండా మాట్లాడలేకపోయేది" అన్నాడు బర్క్.

"కానీ ఇప్పుడు వేరులే. ఇప్పుడు ఒకోసారి గయ్యాళిగంపలా మాట్లాడుతుంది. ఆమెకు అసూయ. ఈర్ష్యాసూయలు నాకు గిట్టవు. అందుకే నేను ఆన్నీతో డాన్సు చేయబోతున్నాను. అది చూసైనా ఆమెకు బుద్ధి వస్తుంది."

"సరే, కానీ జాగ్రత్త! లిజ్ నా గర్ల్ ఫ్రెండైతే, ఆన్నీ, గీన్నీలతో డాన్సు చేయడానికి వెళ్లాల్సి వస్తే మాత్రం, నా బట్టల కింద ఉక్కుకవచం ధరించివెళ్తాను" అని చివరి సలహా ఇచ్చాడు బర్క్.

సారసపక్షి-రాబందుల విహారభూమిలో తిరగసాగింది లిజ్. పక్కన పోతున్న జనం వంక మండే కళ్లతో చూసిందామె. ఆ చూపు అస్పష్టంగా వుంది. ఏవో తిక్కపాటలు హమ్ చేసుకోసాగింది అప్పుడప్పుడూ. మధ్యమధ్యలో పళ్లు బిగించి, తూర్పు వైపు భాషాసంపదను జోడించిన పదునైన పదాలను యథేచ్ఛగా ఉచ్చరించసాగింది.

ఆకుపచ్చ సిల్క్ స్కర్ట్ వేసుకుంది లిజ్. నడుం చుట్టూ బ్రౌన్, పింక్ కలర్లో వున్న ప్లెయిడ్. అదీ స్టయిలుగానే వుంది. వేలికి నకిలీ కెంపులు పొదిగిన వుంగరం; పొడుగాటి వెండిగొలుసుకు వేలాడుతున్న లాకెట్; అరిగిపోయి, వంకర తిరిగిన హైహీల్డ్ షూజ్ పాలిష్ లేక మాసిపోయివున్నాయి. నెత్తిన ఓ పెద్ద హాటు పెట్టుకుంది.

'బ్లూ జే కఫే'లో ఫామిలీ ఎంట్రెన్స్ గుండా ఆమె లోపలికి వెళ్లింది. ఓ టేబుల్ దగ్గర కూర్చుని, తన బండిని సిద్ధం చేసుకుని ఓ భద్రమహిళ గంట నొక్కినట్టుగా ఆమె బటన్ నొక్కింది. వెయిటర్ లోపలికొచ్చాడు. ఆమెకు పరిచితుడే అతను. ఆమెకు గౌరవంగా అభివాదం చేశాడు. లిజ్ చేత్తో తన సిల్క్ స్కర్టును సర్దుకుంది, కదిలిపోతూ. అవకాశా న్నుపయోగించు కుందామె. ఇక్కడ ఆమె ఏ ఆదేశమైనా ఇవ్వగలదు; అతను విధేయంగా ఆమె ఆదేశానన్ననుసరిస్తాడు. ఆమె ప్రపంచం స్త్రీగా ఆమె కిచ్చిన హక్కది.

**అనువాదం: కాకాని చక్రపాణి**

"విస్కీ, టామీ" అందామె, పట్నంలో పైవేపు ఆమె సోదరీమణులు "షాంపేన్, జేమ్స్" అన్నట్టు.

"అలాగే మిస్ లిజీ. ఆ పైన బీరూ, మరేదైనా..."

"సెల్జర్ (మినరల్ వాటర్). సరే, టామీ, ఇవాళ కిడ్ ఇటువేపేమైనా వచ్చాడా?"

"లేదు, మిస్ లిజీ. నేనాయ న్నివాళ చూడలేదు."

గౌరవపూర్వకంగా 'మిస్ లిజీ' అనకుండా మాట్లాడలేడు వెయిటర్. తన ప్రియురాలికి గౌరవమివ్వకపోతే ఊరుకోడు, కిడ్.

"నేను అతని కోసం చూస్తున్నాను" అంది లిజ్. సెల్జర్ నురగలు కక్కుతూంటే, "ఆన్నీ కార్లసన్‌ను డాన్సుకు తీసుకెళ్తానని తను చెప్పాక నాకు మండిపోయింది. తీసుకెళ్లనీ కోతిముచ్చును! అతని కోసమే చూస్తున్నాను. నీకు తెలుసు, టామీ. రెండేళ్లయింది మేం పెళ్లి చేసుకుందామనుకోబట్టి. చూడీ వుంగరం. ఐదొందలైందని చెప్పాడతను. దాన్ని తీసుకెళ్లనీ డాన్సుకు. నేనేం చేస్తానో తెలుసా? అతని గుండె కోసేస్తాను. ఇంకో విస్కీ, టామీ!"

"అలాంటి మాటలనకండి మిస్ లిజీ!" అన్నాడు వెయిటర్ మృదువుగా. "మీలాంటి లేడీని వదిలేసే టైపు మనిషి కాదు కిడ్ ములాలీ. సెల్జర్ కూడా తీసుకొచ్చేదా?"

"రెండేళ్లు" అంది మళ్లీ లిజ్. మత్తు ప్రభావంతో ఆమె గొంతులో కొంత మార్దవం వచ్చింది. "నాకు ఇంట్లో ఏం పనుండేది కాదు. అందుకే సాయంకాలాలు వీధుల్లో ఆడుతూ గడిపేదాన్ని. చాలాకాలం నేను ఇంటి గడప మీదే కూర్చుని కాలం గడిపేదాన్ని, వచ్చేపోయే వాళ్లను చూస్తూ. అప్పుడు ఓ రోజు సాయంకాలం కిడ్ వీధిలో పోతూ కనిపించాడు, నా మీదో అభిప్రాయం కలిగించటానికి. నాకూ అతనంటే ఇష్టం కలిగింది. అతను మొదటిసారిగా నా చేత తాగించినప్పుడు, ఇంట్లో రాత్రల్లా ఏడుస్తూనే గడిపాను. అలా ఏడ్చినందుకు దెబ్బలు కూడా తిన్నాను. మరిప్పుడు?-సరే, టామీ. నువ్వెప్పుడైనా ఈ ఆన్నీ కార్లసన్‌ను చూశావా? ఆ ముఖానికీ, జుట్టుకూ కోటింగులు వేసుకోకపోతే, దాని ముఖం చూసే వాడుండడు! పోన్లే, నేనతని కోసమే చూస్తున్నాను. అతను లోపలికొస్తే చెప్పు. నేను... నేను అతని గుండె చీల్చి పారేస్తాను! ఆ సంగతి నేను చూసుకుంటాలే, ఇంకో విస్కీ, టామీ!"

ఒళ్లు తూలుతుంటే లిజ్ వీధిలో నడవసాగింది; అయినా, మెరుస్తూన్న ఆమె కళ్లు అతని కోసం వెతుకుతూనేవున్నాయి. ఓ ఇటుక రాయి బిల్డింగ్ గుమ్మం ముందు ఉంగరాల జుట్టున్న ఓ చిన్నపిల్ల కూర్చునివుంది. ఆమె చేతిలోని దారపు బంతి నుంచి విచ్చుకుపోయి దూరం చిక్కుపడితే, చిక్కు తీసే ప్రయత్నంలో వుందా పిల్ల. ఎర్రబారిన ఆమె ముఖంలో వంకరనవ్వు మారిపోతూంటే, వచ్చి ఆ చిన్నపిల్ల పక్కన కూర్చుంది లిజ్. ఇప్పుడామె కళ్లు నిర్మలమయాయి, కపటం లేనివయాయి.

"పిల్లికి ఊయల ఎలా తయారుచెయ్యాలో నేన్నీకు నేర్పేదా, పాపా?" అంటూ ఆమె షూజ్ కిందికి తన ఆకు పచ్చ సిల్క్ స్కర్టును లాక్కుంది.

వాళ్లలా కూర్చుని వుండగా, కుర్రకారు జులాయి క్లబ్బు హాల్లో దీపాలు వెలిగించారు, డాన్సుకు సిద్ధం చేస్తూ. రెండు నెల్లకోసారి జరిగే డాన్సు పార్టీ అది. అందుకోసం చక్కటి డ్రెస్ వేసుకుని సభ్యులు గర్వంగా వస్తూంటారు. అక్కడి ఫాషన్లు చూసి తామింకా గొప్పగా అలంకరించుకోవాలని

తాపత్రయపడిపోతూ వుంటారు.

రాత్రి తొమ్మిది గంటలకు ప్రెసిడెంట్, కిడ్ ములాలీ డాన్స్ ఫ్లోర్‌కు వచ్చాడు తన లేడీతో పాటు. ఆమె జుట్టు బంగారం రంగులో మెరిసిపోతోంది. చాలా నాగరకంగా మాట్లాడుతోంది ఆమె. ఐతే, పట్నంలోని జనానికి తెలియని నాగరకత కాదు. తన వెనుక జీరాడుతున్న రవసెల్లా పైన కాలేసి, సిగ్గుపడిపోయిందామె కిడ్ ములాలీ కళ్లల్లోకి చూసి నవ్వింది.

అలా వాళ్లు ఆ మైకపు ఫ్లోర్ మీద నిలబడివున్నప్పుడు, ఆ సంఘటన జరిగింది. హాల్లోని ప్రేక్షకుల వలయంలో నుంచి 'విధి' ఆకు పచ్చ రంగు సిల్క్ స్కర్ట్ వేసుకుని ముందుకు దూకింది. ఆమె కళ్లు కర్కశంగా వున్నాయి, కాటుక కంటే నల్లగా వున్నాయి. ఆమె అరవలేదు, తొట్రుపాటు పడలేదు. స్త్రీకి తగని బూతు కూత కూసింది-అది కిడ్‌కు చాలా ఇష్టమైన బూతు-అతని గొంతులో నుంచి పలికినట్టే వుంది అది. కుర్రకారు జులాయి క్లబ్బు సభ్యులు కకావికలైపోయారు. ఆమె, వెయిటర్ టామీతో కోసిన కోతలు నిజం చేసేసింది, కత్తి పొడుగున్నంత వరకూ, తన బలం అనుమతించిన వరకూ!

ఆ తర్వాత మేల్కొంది. ఆత్మసంరక్షణభావం -లేక అది ఆత్మవినాశకభావనా? ఆ భావాన్నే ప్రాకృతమైన కొమ్మకు అంటు కట్టింది సమాజం.

లిజ్ బయటికి పరుగెత్తింది. సాయంకాలం పూట అడవి కోడి మొక్కల మధ్య పరుగెత్తినట్టుగా, ఆమె వీధిలో జనాన్ని తప్పించుకుంటూ మహావేగంగా పరుగెత్తింది.

అప్పుడు మొదలైంది పట్నానికి లజ్జ కలిగించాల్సిన సన్నివేశం-ప్రాచీనంగా కుళ్లిపోయిన సమాజాన్ని తొలుస్తున్న పురుగు, పట్నకాలుష్యం-అవమానం, దాని మహమ్మారి-తలతిరుగుడుతనం, దాని శాశ్వతాపకీర్తినేరం, అదుపు చేయకుండా పెంచుతూ పోతూ అభిమానిస్తూ దీర్ఘశతాబ్దుల నుంచీ తరతరాలకూ అందించిన మహానీచపాశవికత-పెద్ద గోలా, అరుపులూ, రభసా. పెద్ద పెద్ద పట్నాల్లో తప్ప అది మరెక్కడా బతికి బట్ట కట్టలేదు. ఇక్కడ, సంస్కృతి అంతిమపరిపూర్ణతను చేరుకున్న చోట, పౌరసత్వం ఆ పైన ఆరోపించుకున్న ఆధిక్యం చేతులు కలిపిన చోట-జనం అరుపులూ, గోలతో వేట ప్రారంభమైంది.


వాళ్లు తరిమారు-గోల పెడుతూన్న తండ్రులూ, తల్లులూ, ప్రేమికులూ, నవ్వుల గుంపూ-పెడబొబ్బలు పెడుతూ, గోలగా అరుస్తూ, పిలుస్తూ, ఈల వేస్తూ, రక్తానికి రక్తమని కేకలు పెడుతూ-ఆమెను తరిమారు. పట్నంలో తోడేలు బయటికొచ్చి నిలిచింది. దాని గుండె, మృదువైంది కనుక, బలిపశువును చేజిక్కించుకున్నప్పుడు గడి తప్పవచ్చు. ఆమెకు మార్గం తెలుసు, తన అంతానికి ఆత్రుత పడుతోంది ఆమె. బాణంలా దూసుకువెళ్లిం దామె తనకు పరిచితమైన వీధుల గుండా, కంపు కొడుతూన్న రేవును చేరేవరకూ. ఇంక కొన్ని ఆయాసపడుతున్న అడుగుల దూరమే-ఆ పైన ప్రాచీనదీమతల్లి లిజ్‌ను తన అక్కున చేర్చుకుంది, తన బురద చేతులతో వెంటనే ఆమెను ప్రశాంతపరిచింది, అలా వేల పాస్టరేట్లలో, కాలేజీల్లో రాత్రులు దీపాలు వెలిగించి అధ్యయనం చేస్తూండాల్సిన సమస్యను ఐదు నిముషాల్లో తీర్చేసింది.

000

ఒకోసారి మనిషి ఎలాంటి కలలు కంటాడో ఆలోచిస్తే మహావిచిత్ర మనిపిస్తుంది. కవులు వాటిని స్వాప్నికదర్శన మంటారు. కానీ, నిజాని కవి ముక్తఛందస్సులో కూర్చిన స్వప్నాలే! మిగతా కథను గురించిన కల నేను కన్నాను.

నేను పైలోకంలో వున్నట్టనిపించింది. నేనక్కడి కెలా చేరానో నాకే తెలియదు. ఏమైనా, నేనక్కడున్నాను. నేనే కాదు, నాలాంటివాళ్లు చాలామంది గుంపు కట్టి కోర్టు రూం ముందు నిలబడ్డారు. అక్కడ తీర్పులివ్వటం జరుగుతోంది. అప్పుడప్పుడూ మహాసౌందర్యంతో వున్న న్యాయస్థాన అధికారదేవత బయటికొచ్చి, హుందాగా మరో కేసు నంబరు చదువుతోంది.

నేను నా ప్రాపంచికపాపాల గురించి ఆలోచిస్తూ, నేనప్పుడు న్యూజెర్సీలో వున్నానని ఎలిబీ చూపిస్తే ప్రయోజనమేమైనా వుంటుందా అనుకుంటూ వుంటే, కోర్టు బంట్రోతు దేవదూత




వచ్చి కేసు నంబరు చదివాడు:

"కేసు నంబరు 99, 852, 743."

ఓ ప్లెయిన్ క్లోత్స్ దేవదూత ముందుకొచ్చాడు. అలాంటివాళ్లు చాలామంది అక్కడున్నారు, మతప్రచారకుల్లా దుస్తులు ధరించి, భూమ్మీద పోలీసు లెలా జనాన్ని పక్కకు తోసేస్తుంటారో, అచ్చంగా అలాగే మా ప్రేతాత్మలను అదిలిస్తున్నారు. ఆ మఫ్టీలో వున్న దేవదూత ఓ చేయి పట్టుకులాగాడు -ఎవరనుకున్నారు మీరు? ఇంకెవరు, ఆమె లిజ్!

కోర్టు ఆఫీసరు ఆమెను లోపలికి తీసుకెళ్లి, తలుపు వేశాడు. నేనో పోలీసు దేవదూత దగ్గరికెళ్లి, కేసు ఏమిటో విచారించాను.

"మహా విచారకరమైంది కేసు!" అన్నాడతను, "మహాపాపం చేసిన పిల్ల ఆమె. నా పేరు రెవరెండ్ జోన్స్. నేను పార్థివలోకప్రత్యేకాధికారిని. కేసు విచారించమని నాకే అప్పజెప్పారు. ఆ పిల్ల తన ప్రియుణ్ని హత్య చేసింది, తనూ ఆత్మహత్యకు పాల్పడింది. తను నేరం చేయలేదనటానికి ఆమెకు ఆధారా లేం లేవు. నా నివేదికలో వివరంగా సత్యాలన్నిటినీ వక్కాణించాను, వాటన్నిటినీ నమ్మదగిన సాక్షులు బలపరిచారు. పాపప్రతిఫలం మృత్యువు. ప్రభువుకు జయమగుగాక!"

కోర్టు అధికారి తలుపు తీసి, బయటికొచ్చాడు.

"పాపం, ఆ పిల్లను చూస్తే జాలేస్తుంది" అన్నాడు, కళ్లంబట నీళ్లు కారుతూంటే, పార్థివలోకప్రత్యేకాధికారి రెవరెండ్ జోన్స్. "నేను డీల్ చేసిన కేసుల్లోకెల్లా మహాదౌర్భాగ్యమైన కేసిది. ఐతే, ఆమెను-"

"విడుదల చేశారు" అన్నాడు కోర్టు అధికారి. "ఇలా రా, జోన్సీ. ముందుగా నువ్వు తెలుసుకోవలసింది, నిన్ను తిండిమండలం దండుకు మారుస్తున్నాను. దక్షిణసముద్రద్వీపాల్లో మిషనరీ బలగంలో ఒకడుగా పంపిస్తే ఎలా వుంటుంది నీకు? ఏం, మాట్లాడవు? నువ్వింక తప్పుడు అరెస్టులు చేయటం మానెయ్యి. లేదూ, నిన్ను బదిలీ చెయ్యటం మాత్రం ఖాయం! చూడు, ఈ కేసులో నువ్వు అరెస్టు చెయ్యవలసిన అపరాధి తన పిల్లలు వీధుల్లో ఆడుకుంటూవుంటే, కిటికీ పక్కన కూర్చుని, పేపరు చదువుకుంటూ వుంటాడే, ఎర్రజుట్టు మనిషి, పెరిగిన గడ్డంతో వుండే గిజాటు మనిషిని-అతన్నీ నువ్వు అరెస్టు చెయ్యాల్సింది. చేసింది చాలు, ఇంక పద!"

ఎలాంటి పిచ్చి స్వప్నం ఇది!

■